ప్రజాశక్తి
సోమవారం 9 డిసెంబర్ 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

ఇక 'స్మార్ట్' దోపిడీ..?

- ఈపాటికే ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లు
- గృహాలకూ బిగించేందుకు సిద్ధమవుతున్న అధికారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కూటమి ప్రభుత్వం 'స్మార్ట్'గా ప్రజలపై భారాలు మోపేందుకు సిద్ధమవుతోంది. ఎన్నికల ముందు విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తీవ్ర స్వరంతో వ్యతిరేకించిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఇప్పుడు దాని గురించి నోరుమెదపడం లేదు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆమోద యోగ్యమైదనంటూ సన్నాయి నొక్కులు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపిన ప్రభుత్వం తాజాగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల్లో అధికారులు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మీటర్లు ఏర్పాటు చేసే విద్యుత్ వినియోగానికి ప్రీపెయిడ్ విధానం అమల్లోకి వస్తుంది. ముందస్తుగా రీఛార్జ్ చేయిస్తేనే విద్యుత్ వచ్చే అవకాశం ఉంది.

వైపాలెం సబ్ డివిజన్ పరిధిలో..

యర్రగొండపాలెం మండలంలో 17 వేల గృహోపకరణాల విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. 713 వాణిజ్య సయుదాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. పుల్లలచెరువు మండలంలో 9514 గృహోపకరణాల విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. 380 వాణిజ్య సయుదాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. త్రిపురాంతకం మండలంలో 13,612 గృహోపకరణాల విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. 715 వాణిజ్య సయుదాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటికే వాణిజ్య సముదాయాలకు సంబంధించి పాత మీటర్లను తొలగించి స్మార్ట్ మీటర్లను బిగించే ప్రక్రియ దాదాపు పూర్తైంది. ఇప్పుడు గృహోపకరణాల మీటర్లను మార్చి స్మార్ట్ మీటర్లను బిగించేందుకు విద్యుత్ అధికారులు సిద్ధమవుతున్నారు.

ప్రీయిడ్ విధానంతో..

ప్రీపెయిడ్ విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే రీఛార్జ్ చేస్తేనే విద్యుత్ సరఫరా ▶ 2లో

మూతపడ్డ పాఠశాలల సంగతేంటి?

- జీవో నంబరు 117 రద్దు ఇప్పటికీ ప్రశ్నార్థకమే
- విలీనం పేరుతో జిల్లాలో 350 ప్రాథమిక పాఠశాలలు మూత

శింగరాయకొండ మండలం కనుమళ్ల గ్రామంలో మూతపడిన ఎంపిపి పాఠశాల

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పాఠశాలల్లో ప్రవేశపెట్టిన పేరెంట్-టీచర్స్ సమావేశం పట్ల ప్రజలు, ఉపాధ్యాయుల్లో సానుకూల స్పందనే వస్తోంది. దీన్ని ఉపాధ్యాయ సంఘాలూ ఆహ్వానిస్తున్నాయి.ప్రభుత్వ పాఠశాలల్లో ఈ తరహా కార్యక్రమాలు మంచి పరిణామమే. అయితే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా అడుగులు పడాలి. ఆ బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా ప్రవేటు పాఠశాలలకు అనుమతి ఇచ్చారు. ఎలాంటి సౌకర్యాలు లేకపోయినా వీధికో కాన్వెంట్ వచ్చింది. చీకటి గదుల్లోనే చదువులను కొనుక్కొంటున్నారు. పిల్లలను అక్కడకు పంపడానికి కారణం ప్రవేటు విద్యపై పెరిగిన మోజుగా చెప్పక తప్పదు. కేరళ లాంటి రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలలను ప్రవేటు వాటికన్నా మెరుగ్గా అక్కడ ప్రభుత్వం తీర్చిదిద్దింది. ఇక్కడ అలాంటి పరిస్థితి రావాలి. గత ప్రభుత్వం నాడు-నేడు పథకం పెట్టింది. పాఠశాలకు రంగులు వేశారు. టైల్స్ అంటించారు. ఆ తర్వాత జీవో నెంబరు 117తో వాటిని మూసేశారు. విలీనం పేరుతో జిల్లాలో ఈ జీవో పుణ్యమా అంటూ గ్రామాల్లో 350 ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. భవనాలు శిథిలమవుతున్నాయి. వాటిని ఖాళీగా పెట్టారు. ఇంకొద్దిరోజులు గడిస్తే ఎందుకు పనికిరాకుండా పోతాయి. ఇపుడు వాటిని తిరిగి పునరుద్ధరించాలి. ప్రాథమిక పాఠశాలలకు కిలోమీటరు లోపు హైస్కూల్ ఉంటే అందులో వీటిని కలిపేశారు. 1 నుంచి 3 తరగతుల పిల్లలను అక్కడకు పంపి విలీనం చేశారు. దీంతో ప్రాథమిక పాఠశాలలు పెద్ద ఎత్తున మూతపడ్డాయి. జిల్లాలో అప్పట్లో ఈ విలీనం ప్రక్రియ ప్రజాప్రతినిధులకు కూడా తెలియదు. జడ్‌పి సమావేశంలోనూ ఎంపీ మాగుంటతోపాటు పలువురు ఎమ్మెల్యేలు దీనిపై మాట్లాడారు. పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకు కనీసం ప్రజాప్రతినిధులకు తెలియకుండానే మూసేశారని పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇపుడు వాటిని పునరుద్ధరించాలి. యుటిఎఫ్ జిల్లా మహాసభల్లోనూ దీనిపై తీర్మానం చేశారు.గత ప్రభుత్వంతెచ్చిన ఈ జీవోను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోంది. దీన్ని రదు చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. తల్లిదండ్రులు కూడా ఇదే చెబుతున్నారు. ఈప్రక్రియ వల్ల తిరిగి 350 ప్రాథమిక పాఠశాలలు పిల్లలకు అందుబాటులోకి వస్తాయి.మూసేశాక ప్రత్యామ్నాయం ఏమిటనేది విద్యాశాఖ దృష్టిపెట్టలేదు.చిన్న ▶ 2లో

రక్తమోడిన రహదారులు..

- వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి
- మరో ముగ్గురికి గాయాలు
- అన్నంబొట్లవారిపాలెంలో బైకును ఢీకొన్న టిప్పర్
- నాగులపాలెంలో సైకిల్‌ను ఢీకొన్న టిప్పర్
- జాగర్లమూడి వారిపాలెం వద్ద లారీని వెనుక నుంచి ఢీకొన్న స్కూటీ

మృతులు షేక్ బుడేమా, షేక్ మస్తాన్ వలి,అమీరున్

ప్రజాశక్తి - పర్చూరు,పంగులూరు

వేర్వేరు ప్రమాదాలతో రహదారులు రక్తమోడాయి. నలుగురు మృతిచెందగా, మరో ముగ్గురు తీవ్ర గాయాలయ్యాయి. పర్చూరు మండలంఅన్నంబొట్లవారిపాలెం, పంగులూరు మండలం జాగర్లమూడి వారి పాలెం వద్ద ఈ ప్రమాదాలు ఆదివారం చోటు చేసుకున్నాయి. పర్చూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళుతున్న బైకును గ్రావెల్ లోడ్‌తో వస్తున్న టిప్పర్ ఎదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో అత్తా, అల్లుళ్ల షేక్ బుడేమా (45), షేక్ మస్తాన్ వలి (28) మృతి చెందారు. బుడేమా కుమార్తె షేక్ అమీరున్ (23) కు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో చిలుకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మార్టూరు మండలం, కోనంకి గ్రామానికి చెందిన వీరు బైకుపై సముద్ర స్నానం నిమిత్తం చీరాల వెళ్లారు. అక్కడ సముద్ర స్నానాలు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. అత్త బుడేమా, అల్లుడు మస్తాన్ వలి అక్కడికక్కడే మృతి చెందారు. అమీరున్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పర్చూరు ఎస్ఐ ▶ 2లో

మృతిచెందిన తూమాటి సుబ్బయ్య

గాయపడిన ప్రేమ్ చంద్

ప్రభుత్వ భూమిలో జండాలు పాతుతున్న పేదలు, సిపిఎం నాయకులు

పేదలకు భూములు పంచాలి : సిపిఎం

ప్రభుత్వ భూమిలో ఎర్రజెండాలు పాతిన గంగన్నపాలెం వాసులు

ప్రజాశక్తి-ముండ్లమూరు

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని సిపిఎం జిల్లా నాయకుడు వెల్లంపల్లి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ముండ్లమూరు మండలం మారెళ్ల రెవెన్యూ పరిధిలోని గంగన్నపాలెం గ్రామ సర్వే నంబర్ 532 లోని 18 ఎకరాలల్లో చెట్లు కొట్టి ఎర్ర జెండాలు పాతి భూమిని ఆదివారం స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పెత్తందారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. గతంలో ముండ్లమూరు మండలంలోని అనేక గ్రామాల్లో పేదలను కలుపుకొని భూములు ఆక్రమించి పట్టాలు వచ్చేవరకూ పోరాడినట్లు ఆయన తెలిపారు. గంగన్నపాలెంలోని భూమికి అసైన్మెంట్ కమిటీతో సంబంధం లేకుండా పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు బోడపాటి హనుమంతరావు మాట్లాడుతూ పేదలు ఐక్యంగా ఉండి భూమిని సాధించుకోవాలన్నారు. విడిపోతే పేదలు నష్టపోతారని, కలిసికట్టుగా ఉండి ఈ భూమిని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోటయ్య, మహేష్, హనుమయ్య, వెంకటేశ్వర్లు, మిక్కాయలు, రామయ్య, మార్కు,భరణ బస్సు, చిన్న వెంకటయ్య, తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం ఎస్సీ బీసీ హాస్టల్ విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు, ప్లేట్లు పంపిణీ చేశారు. దాతలు రావినూతల సతీష్ కుమారుడు ప్రణీత్ జన్మదినోత్సవం సందర్భంగా దుప్పట్లను, కంది శ్రీనివాసరెడ్డి కుమార్తె జన్మదినోత్సవం సందర్భంగా భోజన ప్లేట్లను హాస్టల్ విద్యార్థులకు సంతనూతలపాడు తహశీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శనగల వెంకటరమణ, వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, జాయింట్ సెక్రెటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు రాము, రవి, ట్రస్టు సెక్రెటరీ చివుకుల రాంగోపాల్, ట్రస్ట్ సభ్యులు ఎస్ మల్లారెడ్డి, కొప్పోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్, ఎన్నారై పాతూరి సంపత్, ట్రస్ట్ చైర్మన్ శనగల వెంకటరమణ పర్యవేక్షణలో దాతల సహకారంతో ఒకపక్క సేవలను, మరోపక్క అన్నదాన వేడుకలను నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి వెల్లడించారు. సేవా సంకల్ప్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద వర్గాలకు నిర్వహిస్తున్న సేవలను, అన్నదాన వేడుకల పట్ల తహశీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి ట్రస్టు ప్రతినిధులను అభినందించారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న తహశీల్దార్ ఆదిలక్ష్మి తదితరులు

ఘనంగా ఘంటసాల జయంతి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని ఎన్జీవో హోంలో ఆదివారం సాయంత్రం ఘంటసాల జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమం త్రివిక్రమ కళాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో జరిగింది. నిర్వాహకులు చిత్తారి రంగనాయకులు, న్యాయవాది పురాణం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఘంటసాలకు నివాళి దృశ్యం

మూతపడ్డ పాఠశాలల సంగతేంటి?

(మొదటిపేజీ తరువాయి)

పిల్లలు దూరంగా ఉన్న హైస్కూళ్లకు వెళ్లలేక సమీపంలో ఉన్న ప్రవేటు స్కూళ్లకు పోతున్నారు. అప్పట్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా పర్యటన చేశారు. అనేక పాఠశాలలు తిరిగి తల్లిదండ్రులతో మాట్లాడారు. వారి అభిప్రాయాలు మండలిలోనూ ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఏ నిర్ణయమూ తీసుకోలేదు. విలీనం వల్ల 400 పోస్టులు కూడా తగ్గిపోయాయి. టీచర్లను సర్దుబాటు చేశారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన మెగా డిఎస్సిలో 700 వరకూ ఖాళీలున్నాయి. వాటిని కూడా వేగంగా భర్తీ చేయాలి. ప్రస్తుతం విద్యా వాలంటీర్లను కూడా పెట్టనందున ఉన్న ఉపాధ్యాయులపైనే బోధనా భారం పడింది. పాఠశాలల్లో పేరెంట్స్-టీచర్ల సమ్మేళనాలు పెడుతున్నారు. అక్కడున్న సమస్యలన్నిటికీ పరిష్కారం చూడాలి. తక్షణ కర్తవ్యంగా మూతపడ్డ పాఠశాలలను తెరిస్తే గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలకు మేలు జరుగుతుంది. ఈ పాఠశాలల్లో 20 మంది పిల్లలకు ఒక ఉపాధ్యాయుడు చొప్పున పెట్టి కొనసాగించాలని యుటిఎఫ్ కోరుతోంది. 30 మంది దాటితే మరొకరిని ఇవ్వాలనే ప్రతిపాదన చేసింది. పాఠశాల బలోపేతానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. పాఠశాలల్లో కనీస సౌకర్యాల కల్పన దిశగా అడుగులు వేయాలి. అందుకు ఈ సమ్మేళనాలు దోహదపడతాయని ఆశిద్దాం.

రక్తమోడిన రహదారులు

(మొదటిపేజీ తరువాయి)

మాల్యాద్రి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పిడుగురాళ్ల-వాడరేవు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గ్రావెల్ తరలిసున్నారు. డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్లే తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

సైకిల్‌ను టిప్పర్ ఢీకొన్న ఘటనలో...

సైకిల్‌ను టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని నాగులపాలెం వద్ద చోటు చేసు కుంది. ఈ ప్రమాదంలో తూమాటి సుబ్బయ్య (74)మృతిచెందాడు. నాగులపాలెంకు చెందిన తూమాటి సుబ్బయ్య సైకిల్‌పై పర్చూరు వస్తున్నాడు. అదే సమయంలో చీరాల వైపు నుంచి వస్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో సుబ్బయ్య అక్కడిక్కడే మృతిచెందాడు. సుబ్బయ్య భార్య రెండేళ్ల క్రితమే చెందింది. ఎస్ఐ మాల్యాద్రి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

లారీని స్కూటీ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలు

పంగులూరు : ముందు వెళుతున్న లారీని వెనుక వస్తున్న స్కూటీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని జాగర్లమూడివారి పాలెం వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఒంగోలు నుంచి గుంటూరు వైపు ఓ లారీ వెళుతోంది. అదే సమయంలో మంగళగిరికి చెందిన ఇద్దరు వ్యక్తులు స్కూటీపై వెళుతున్నారు. ఘటనా స్థలం వద్ద వెళ్లే సరికి ముందు వెళ్తున్న లారీని స్కూటీ ఢీకొంది. దీంతో స్కూటీ నడుపుతున్న కె. ప్రేమ్‌చంద్, వెనకవైపు కూర్చున్న మరో మహిళ తీవ్రంగా గాయాపడ్డారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రేణింగవరం ఎస్ఐ వినోద్‌బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇక 'స్మార్ట్' దోపిడీ..?

(మొదటి పేజీ తరువాయి)

అయ్యే అంశంపై ప్రజల నుంచి వ్యతిరేకత ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి దృష్టిని మరల్చేందుకు ప్రభుత్వ కార్యాలయాలకు అంటూ స్మార్ట్ మోసానికి తెరలేపినట్లు తెలుస్తోంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల ఏ ప్రాంతంలో ఏ మేరకు విద్యుత్ వినియోగంలో ఉంది. లోవోల్టేజ్, విద్యుత్ సరఫరాలో అంతరాయం తదితర సమాచారం విద్యుత్ అధికారులకు వెంటనే అందుతుంది. వీటిని సాకుగా చూపి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో విద్యుత్ భారాలు మరింత ఎక్కువ అయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నోరు మెదపని కూటమి నేతలు..

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సూచన మేరకు వైసిపి ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ అప్పట్లో తెరపైకి తెచ్చింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయ పంపుసెంట్లకు వీటిని ఏర్పాటు చేసేందుకు విద్యుత్ అధికారులు సిద్ధమయ్యారు. దీనిపై రైతుల్లో పెద్దఎత్తున వ్యతిరేకత వ్యక్తం అయ్యింది. సిపిఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపట్టి వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయకుండా అడ్డుకున్నారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి సైతం స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించింది. మీటర్లు ఏర్పాటు చేస్తే తాము పగలగొడతామంటూ ప్రకటనలు చేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చాపకింద నీరులా విస్తరిస్తున్నా కూటమి నేతలు నోరు మెదపకపోవడం గమనార్హం.

ప్రభుత్వ కార్యాలయాలకూ పెద్ద చిక్కే...

ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ బిల్లుల చెల్లింపు సక్రమంగా జరగడం లేదు. బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ పలు సందర్భాల్లో విద్యుత్ అధికారులు ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ సరఫరాను నిలిపేసిన సందర్భాలూ ఉన్నాయి. ఇలాంటి తరుణంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే కచ్చితంగా ముందస్తుగా రీఛార్జీ చేయించుకోవాల్సి ఉంటుంది. విద్యుత్ వినియోగించుకున్న తర్వాత బిల్లు కట్టడమే కష్టంగా ఉన్న తరుణంలో ముందస్తుగా కార్యాలయాలకు రీఛార్జీ చేయించడం అంటే గగనమే అనుకోవాలి. ముందస్తు రీఛార్జీ చేయించకుంటే కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. దీంతో అధికారులు, ప్రజలు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది.

రీఛార్జీ చేయకుంటే విద్యుత్ కట్..

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే వినియోగం తర్వాత బిల్లు చెల్లించే విధానం రద్దు అవుతుంది. సెల్ ఫోన్ల మాదిరి వినియోగించక ముందే ముందస్తుగా రీఛార్జీ చేయించుకోవాలి. నెలలో ఎంత విద్యుత్ వినియోగం అవసరం అవుతుందో దానిని బట్టి ముందస్తుగా రీఛార్జీ చేయించుకోవాలి. రీఛార్జీ చేసిన నగదు అయిపోగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

సామాన్యులకు కష్టం
షేక్ వలి, యర్రగొండపాలెం

స్మార్ట్ మీటర్లు రీఛార్జ్ చేసుకోవాలంటే సామాన్యులకు కష్టంగా ఉంటుంది. రీఛార్జ్ అయిపోతే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. దీనివల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

గత ప్రభుత్వ విధానాలే..
టంగుటూరి సత్యనారాయణ
సిపిఎం మండల కార్యదర్శి

గత ప్రభుత్వ విధానాలనే కూటమి ప్రభుత్వం అవలంబిస్తోంది. దీనివల్ల రైతులకు, వ్యాపారులకు ఇబ్బందిగా ఉంటుంది. స్మార్ట్ మీటర్లు పనిచేయకపోతే సరఫరా నిలిచిపోతుంది. బోరు మోటర్లకు విద్యుత్ సరఫరా నిలిచి పనిచేయవు. అందువల్ల రైతులకు నష్టం వాటిల్లుతుంది. ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలుపుదల చేయాలి.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No: 236/2023

సంపెంగుల నరేష్‌బాబు ...... వాది

Vs

అంబటి ప్రసన్నలక్ష్మి ఇంకొకరు .... ప్రతివాదులు

To

D2) అంబటి పావని @ నల్లమల్లి పావని
D/o మహా లింగం W/o వెంకటస్వామి,
D.No :35-1-28 దేవుడు చెరువు,
ఆంధ్ర బ్యాంకు దగ్గర, ఒంగోలు.

పై నంబరు దావాని వాది మీలో 1వ వాదికి భర్త 2వ వారికి తండ్రి అయిన మహా లింగం వ్రాసిఇచ్చిన ప్రాంసరీనోటు బాకీ వసూలు నిమిత్తం దాఖలా చేసి రెండవ ప్రతివాదికి ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వులతో మీరు తేది : 09-01-2025న ఉదయం 10.30 నుండి సాయంత్రం ఐదు గంటల లోపు పైకోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనేది. లేనిచో దావాని మరియు అటాచ్మెంట్ పిటిషన్లు మీపరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది : 09-01-2025

// కోర్టు వారి ఉత్తర్వులతో //

మోతుకూరి శుభాష్ బాబు
మురకొండ చంద్రశేఖర్
అద్వకేట్స్, అద్దంకి.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No : 531/2017

G.S వజీర్ అహమ్మద్ .. వాది

వర్సస్

కొణతం వీర రాఘవరెడ్డి మరియు ఐదుగురు ..ప్రతివాదులు

టు,

ప్రతివాదుల చిరునామా :

5వ (ప్రతివాది) కొణతం శిరీష
తండ్రి లేటు కొణతం వీర రాఘవ రెడ్డి, హిందూ,
ఇ.నం. 9/136, నెహ్రూ నగర్, కంభం గ్రామం
మరియు మండలం, ప్రకాశం జిల్లా.

6వ (ప్రతివాది) కొణతం శ్వేతా
తండ్రి లేటు కొణతం వీర రాఘవ రెడ్డి, హిందూ,
ఇ.నం. 9/136, నెహ్రూ నగర్, కంభం గ్రామం
మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది దావా ప్లైంటు పరిహారం రాగోరి మీ పై గిద్దలూరు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 11 తేదీ డిసెంబర్ నెల 2024 సం: లో ఉన్నది. మీరు ఆ వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో మీపరోక్షమునందు దావా విమర్శించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ : 08-12-2024 ఇట్లు

శ్రీ షేక్ యాసిన్ బాషా,
వాది తరుపు అద్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం. 9346513649

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No: 592/2023

మర్రి రంగస్వామి .. వాది

వర్సస్

కొంగలవీటి రమణరెడ్డి .. ప్రతివాది

టు,

ప్రతివాది చిరునామా

(ప్రతివాది) కొంగలవీటి రమణ రెడ్డి
తండ్రి గురువరెడ్డి, వయసు సుమారు 50
సంవత్సరాలు, హిందూ, ఎక్స్ -ఆర్మీ ,
నివాసి 6వ వార్డ్, యాదవ బజార్, గిద్దలూరు టౌన్,
పోస్టు మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది దావా ప్లైంటు పరిహారం రాగోరి మీ పై గిద్దలూరు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 13 తేదీ డిసెంబర్ నెల 2024 సం.లో ఉన్నది. మీరు ఆ వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో మీపరోక్షమునందు దావా విమర్శించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ : 08-12-2024 ఇట్లు

శ్రీ షేక్ యాసిన్ బాషా,
వాది తరుపు అద్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం : 9346513649

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. 608/2023 , I.A. 609/2023
I.A. 1011/2022 in O.S. 459/2016

పిట్టల రంగ బాబు ..పిటిషనరు/వాది

వర్సస్

పసుపులేటి చిన్న నాగయ్య (మరణించారు)
మరియు 2 నుండి 4 అతని వారసులు..1వప్రతివాది
పసుపులేటి నారాయణ (మరణించారు)
మరియు 5 మరియు 6 అతని వారసులు
.. 2వ ప్రోపోజుడు ప్రతివాది
పసుపులేటి నాగేశ్వర రావు మరియు ముగ్గురు
..ప్రోపోజుడు ప్రతివాదులు 5 మరియు 6

టు,

ప్రతివాదుల చిరునామా :

3వ (ప్రతివాది) పసుపులేటి నాగేశ్వర రావు
తండ్రి పసుపులేటి చిన్న నాగయ్య,
వయసు సుమారు 52 సంవత్సరాలు, హిందూ,
వ్యాపారము, నివాసి జంగంగుంట్ల గ్రామం
మరియు పోస్టు, కంభం మండలం, ప్రకాశం జిల్లా.

4వ (ప్రతివాది) పసుపులేటి రమణ రావు
తండ్రి పసుపులేటి చిన్న నాగయ్య,
వయసు సుమారు 50 సంవత్సరాలు, హిందూ,
వ్యవసాయం, నివాసి జంగంగుంట్ల గ్రామం
మరియు పోస్టు, కంభం మండలం, ప్రకాశం జిల్లా.

5వ (ప్రతివాది) పసుపులేటి రామ లక్ష్మి భర్త
లేటు పసుపులేటి నారాయణ,
వయసు సుమారు 45 సంవత్సరాలు, హిందూ,
వ్యవసాయం, నివాసి జంగంగుంట్ల గ్రామం
మరియు పోస్టు, కంభం మండలం, ప్రకాశం జిల్లా.

6వ (ప్రతివాది) పసుపులేటి బాబు
తండ్రి లేటు పసుపులేటి నారాయణ,
వయసు సుమారు 32 సంవత్సరాలు, హిందూ,
వ్యవసాయం, నివాసి జంగంగుంట్ల గ్రామం
మరియు పోస్టు, కంభం మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు పిటిషన్‌లో వాది పిటిషన్ పరిహారం రాగోరి మీ పై గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో పిటిషన్ దాఖలు చేసినందున, సదరు పిటిషన్ లో మీరు పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 19వ తేదీ డిసెంబర్ నెల 2024సం: లో ఉన్నది. మీరు ఈ వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్ట్ హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో మీ పరోక్షమునందు పిటిషన్‌ను విమర్శించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ : 08-12-2024 ఇట్లు

శ్రీ షేక్ యాసిన్ బాషా,
పిటిషనర్ల తరుపు అద్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం. 9346513649

రెక్కల కష్టం.. నీటిపాలు

వర్షాలకు మునిగిన పంటలు

కోలలపూడిలో 80 ఎకరాల్లో వరిసాగు

ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

తడిచిపోయిన వరిని ఆరబెడుతున్న రైతులు

ప్రజాశక్తి-మార్టూరు

ఇటీవల తుఫానుకు మండలంలోని కోలలపూడి గ్రామంలో 80 ఎకరాలకు పైగా వరి పంట నీటిపాలైంది. రెక్కల కష్టం చేసి పండించిన రైతులకు ఫలితం దక్కే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాలకు సాగు చేసిన వరి పొట్ట దశలో నీటిలో మునగడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్లో మండలంలో మొదట వరి నాట్లు వేసేది, పంటను కోసేది కూడా కోలలపూడి రైతులే. సుమారు వంద రోజుల క్రితం నాటిన వరి డిసెంబర్ నెల ఆఖరిలోపు కోతకి వస్తుంది అనుకుంటుండగానే అకాల వర్షాలకు నీట మునగడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సుమారు 30 మందికి రైతులకు చెందిన 80 ఎకరాల వరి పంట చేతికి దక్కకుండా పోవడంతో రైతులు ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. కౌలుతో కలిపి ఎకరాకు 60 వేల రూపాయలు పెట్టుబడిగా పెట్టిన రైతులు మొలక వచ్చిన వరి పైరును చూసి దిగాలు పడుతున్నారు. విత్తనం పొట్టకు చేరే దశలో వర్షం పడటంతో పంట తిరిగి కోలుకునే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. తడిసిన ధాన్యం ఏమైనా చేతికి అందితే ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా కోలలపూడి గ్రామంలో 80 ఎకరాల వరి పంట నీట మునిగినట్లు క్షేత్రస్థాయిలో గుర్తించి జిల్లా అధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. రైతులు తక్షణ ఉపశమనంగా తడిసిన ధాన్యం మొలక రాకుండా ఉండటం కోసం ఐదు శాతం ఉప్పు నీటి ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లోని ప్రతి పంటకు పంటల బీమా చేయించిన పంటలకు నష్టపరిహారం అందేలా చూస్తామని ఏవో కిరణ్ కుమార్ తెలిపారు.

రెక్కల కష్టం నీటి పాలైంది

తాతా ఏడుకొండలు, కోలలపూడి

బిపిటి రకం వరి విత్తనాలను సుమారు 100 రోజుల క్రితం ఒక ఎకరం డెబ్బయి ఐదు సెంట్లులో సాగు చేశాను. రూ.60 వేలు పెట్టుబడి, కౌలు కలిపి మొత్తం లక్ష రూపాయల వరకు ఖర్చు చేశాను. పంటల బీమా పథకం కింద నమోదు చేసుకున్నాను. ప్రభుత్వం రైతుల పరిస్థితి గుర్తించి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలి.

ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో

మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

గాయపడిన మహిళ

జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన మార్టూరు సమీపంలోని శ్రీ దుర్గా మల్లేశ్వరి కళ్యాణ మండపం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. హైవే మొబైల్ పోలీస్ సిబ్బంది జొన్నలగడ్డ రవికుమార్ కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన కొంతమంది వంట బృందం తిరుపతిలో జరిగిన శుభకార్యంలో వంట పనులు ముగించుకొని తిరిగి విజయవాడ వెళుతున్నారు. ఈ క్రమంలో వీరు ప్రయాణిస్తున్న టాటా ఏస్ మ్యాజిక్ డ్రైవర్ రమేష్ నిద్రమత్తు కారణంగా మార్టూరు సమీపంలో ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న మహిళ చేతికి బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రురాలిని ముందుగా మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు సర్వజన సమగ్ర వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ సైదా తెలిపారు.

కేసు నమోదు

ప్రజాశక్తి-యద్దనపూడి

శనగలు కొనుగోలు చేసిన డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండల కేంద్రమైన యద్దనపుడి గ్రామానికి చెందిన గొట్టిపాటి వెంకటరావు శ్రీ శ్రీనివాస కోల్డ్ స్టోరేజ్‌లో సుమారు 320 క్వింటాళ్ల శనగలను కొండలు అనే వ్యక్తికి చిలకలూరిపేట పట్టణానికి చెందిన మధ్యవర్తి గోగుల నాగరాజు ద్వారా అమ్మారు. అయితే మధ్యవర్తి నాగరాజు కొండలు వద్ద డబ్బులు తీసుకుని ఆ డబ్బులను అమ్మిన రైతులకు ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా మోసం చేశాడు. ఈ మేరకు రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యద్దనపూడి పోలీస్ స్టేషన్‌లో నాగరాజుపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు యద్దనపూడి ఎస్ఐ రత్న కుమారి తెలిపారు.

విద్యార్థులకు ప్రశంశాపత్రాలు అందజేస్తున్న ఏఎస్పీ విఠలేశ్వర్

వ్యక్తిగత క్రమశిక్షణ అవసరం

ఎఎస్పి విఠలేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల

విద్యార్థుల్లో వ్యక్తిగత క్రమశిక్షణ అవసరమని అది లేకపోతే ఏమి చేసినా వ్యర్థమేనని బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ అన్నారు. ఆదివారం పట్టణంలో విజయలక్ష్మీపురంలో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన 2కె, 5కె రన్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ శరీరంలో 72 వేల నాడులు ఉంటాయని అవి సరిగా పనిచేయాలంటే శరీరానికి నడక, పరిగెత్తడం చాలా అవసరమని విఠలేశ్వర్ పేర్కొన్నారు పిల్లలకు చదువు కంటే సంస్కారం ప్రధానం అన్నారు. దాన్ని నేర్పించాల్సిన బాధ్యత గురువులతో పాటు తల్లిదండ్రులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సమితి నిర్వాహకులు చిరంజీవి, నటరాజు, సురేష్, సంతోష్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

దళిత నేత నీలం నాగంద్రరావు

మాట్లాడుతున్న నీలం నాగంద్రరావు

ప్రజాశక్తి - చీరాల

ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ రుణాలు వెంటనే ఇవ్వాలని దళిత నేత నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక దళిత మహాసభ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నీలం నాగేంద్రరావు మాట్లాడారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూ ఓట్లు వేయించుకున్న జగన్ ఒక్క రూపాయి రుణం కూడా ఇవ్వలేదన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌ను మాల, మాదిగ, రెల్లి కార్పొరేషన్‌లుగా మూడుముక్కలు చేసి మాల మాదిగలను మాయ చేసిన జగన్‌ను జనం అందుకే ఓడించారన్నారు. ఒక కార్పొరేషన్‌కు రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. కార్పొరేషన్లకు చైర్మన్‌లను డైరెక్టర్లను నియమించారే గాని జీతాలు ఇచ్చి తన భజన చేయించుకున్నాడన్నారు. కానీ ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల ప్రజలకు కార్పొరేషన్ ద్వారా రూపాయి కూడా సాయం చేయలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగులకు కేంద్ర ప్రభుత్వం బ్యాంకులతో సంబంధం లేకుండా ఇచ్చే పలు, పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున గ్యారంటీ ఇవ్వనందున గత ఐదు సంవత్సరాలు రుణాలు ఆపారన్నారు. ఈ ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ రుణాలు కులాలు వారీగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, మోడీ ప్రాయోజిత ఎస్సీ వర్గీకరణను ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్‌గా సుప్రీంకోర్టు గతంలో ఐదుగురు జడ్జీలు ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా ప్రస్తుతం ఏడుగురు సభ్యులు గల ధర్మాసనం తీర్పునివ్వటం ఎస్సీ, ఎస్టీ రాజ్యాంగ హక్కులను తూట్లు పొడవడవడమే అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఐక్యవేదిక నాయకులు గంటా సుబ్బారావు, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు మండలంలోని గుండంచర్ల గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. పెద్దారవీడు రెవెన్యూ సిబ్బంది, డిప్యూటీ తహశీల్దార్ ఇబ్రహీం ఖలీల్, ఆర్ఐ గోపి ఆధ్వర్యంలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. మార్కాపురం సబ్ కలెక్టర్ వారి ఆదేశాల మేరకు.. పెద్దారవీడు మండలంలోని గుండంచర్ల గ్రామంలో దూదేకుల కాశింవలి, చిన్ననాగయ్య ఇంట్లో బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నాయని సమాచారం రావడంతో రెవెన్యూ సిబ్బంది హుటాహుటిన గుండంచర్ల గ్రామానికి వెళ్లి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ మాట్లాడుతూ పెద్దారవీడు మండలంలోని 19 పంచాయతీల్లో రేషన్ డీలర్లు అక్రమంగా రేషన్ బియ్యాన్ని అమ్మినట్లు తెలిస్తే రేషన్ షాప్‌పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ బియ్యాన్ని ఎవరైనా కొనుగోలు చేసినా వారికి కఠిన శిక్ష పడుతుందన్నారు.

పదవుల కోసం ప్రయత్నాలు

నీటి సంఘాల ఏకాభిప్రాయానికి మల్ల గుల్లాలు

ప్రజాశక్తి-చీమకుర్తి

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 8న నిర్వహించాల్సిన నీటి సంఘాల ఎన్నికలు 14వ తేదీకి వాయిదా వేయడంతో పదవులు కైవసం చేసుకోవాలని నాయకుల మధ్య పోటీ పెరిగింది. చీమకుర్తి డివిజన్ పరిధిలో 54 నీటి సంఘాలు, ఆరు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. చీమకుర్తి డివిజన్ పరిధిలో 54,103 పురుష ఓటర్లు, 23,000 మహిళా ఓటర్లు ఉన్నారు. ఈనెల 8వ తేదీన జరగాల్సిన ఎన్నికలను 14వ తేదీన ప్రభుత్వం వాయిదా వేసింది. అదే రోజు ఎన్నికలు మరియు ఎన్నికల ఫలితాలు కూడా ప్రకటిస్తారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఈనెల 17వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలలో నిలబడే అధికార పార్టీ ఆశావహులు పదవుల కోసం పోటీ పడుతున్నారు. చీమకుర్తి ఒకటి డిస్ట్రిబ్యూటర్ కమిటీ, చీమకుర్తి 2 డిస్ట్రిబ్యూటరీ కమిటీ, దర్శి డిస్ట్రిబ్యూటరీ కమిటీ, సంతనూతలపాడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఒకటి, సంతనూతలపాడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ 2, ఒంగోలు డిస్ట్రిబ్యూట్ కమిటీలు ఉన్నాయి. మండలంలో రెండు డిస్ట్రిబ్యూటర్ కమిటీలు ఉండటంతో అధికార పార్టీ నాయకులు అటు నీటి సంఘాలను, ఇటు రెండు డిస్ట్రిబ్యూటరీ కమిటీలను కైవసం చేసుకోవాలని ప్రయత్నిస్తుంది. మండలానికి దక్షిణం వైపు ఉన్న డిస్ట్రిబ్యూటర్ కమిటీలో నాయకులు పోటీ పడుతున్నారు. ఏకాభిప్రాయం కోసం నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈనెల 14 వరకు సంఘాల ఎన్నికలకు సమయం ఉన్నందున ఎవరికి వారే పదవుల కోసం ప్రయత్నాలు చేసినట్టు తెలిసింది.

భరోసా ఇవ్వలేకపోయారు..!

చంద్రబాబు పర్యటనతో ప్రజల్లో నిరాశ

మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

మాట్లాడుతున్న కోన రఘుపతి

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు ఎటువంటి భరోసా ఇవ్వలేకపోయారని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. శనివారం కోన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమం ద్వారా ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులను ముఖ్యమంత్రి నిరాశ పరిచారని పేర్కొన్నారు. చారిత్రాత్మక నేపథ్యం కలిగిన పాఠశాల ఘనత, దాని ప్రాధాన్యతను కూడా చెప్పలేకపోయారని విమర్శించారు. ఎందరో మహనీయులు చదువుకున్న పాఠశాల, విద్యార్థులకు స్ఫూర్తి నింపిన పాఠశాల గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడం ఆవేదన కలిగిస్తుందన్నారు. పది రోజులు రూ.10 కోట్లు ఖర్చుపెట్టి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ద్వారా ఎటువంటి ప్రయోజనం లేదని అన్నారు. వైసిపి హయాంలో నాడు నేడు కింద పాఠశాలల అభివృద్ధి పూర్తిస్థాయిలో జరిగిందని కోన రఘుపతి అన్నారు. ముఖ్యమంత్రి ప్రసంగించిన పాఠశాలలోని భవనాలను తెలుగుదేశ ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటుచేసి అసంపూర్తిగా వదిలేశారని గుర్తు చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి వాటిని నాడు నేడు కింద అభివృద్ధి చేసిన విషయం గుర్తుకు రాకపోవడం విచారకరమన్నారు. బాపట్ల పురపాలక పాఠశాల అభివృద్ధి వైసిపి హయాంలోనే జరిగిందన్నారు. ముఖ్యమంత్రి కూర్చొని ప్రసంగించిన బల్లతో సహా పాఠశాలకు అన్ని వసతులు ఏర్పాటు చేసింది తమ ప్రభుత్వమేనని కోన రఘుపతి అన్నారు. ముఖ్యమంత్రి దిగిన హెలీపాడ్ నుండి పురపాలక పాఠశాలకు వచ్చేవరకు, అక్కడి నుంచి పాఠశాలలో ఆయన కలియ తిరిగిన ప్రాంతం మొత్తం వైసిపి హయాంలోనే అభివృద్ధి జరిగిందనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుంచుకోవాలన్నారు.

బాపట్లకు గుండెకాయ లాంటి మెడికల్ కళాశాల నిర్మాణ విషయంలో స్థానిక ఎమ్మెల్యే గానీ, ఎంపీ గానీ ఆ అంశాన్ని ప్రస్తావించకుండా ప్రజల ఆశలపై నీళ్ళు చల్లారని ఆరోపించారు. జగన్ హయాంలో జరిగిన అభివృద్ధిని కక్షపూరితంగా అడ్డుకునే ప్రయత్నాన్ని ప్రజలు క్షమించరని అన్నారు. తప్పుడు ఆరోపణలు చేసే నాయకులు వాస్తవాలు తెలుసుకోవాలని అన్నారు. అమ్మ ఒడి కింద రూ.15 వేలు ఇస్తేనే ఖజానా ఖాళీ అవుతుందని చెప్పిన ముఖ్యమంత్రి, ఇప్పుడు ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం ఎలా అమలు చేస్తారని కోన రఘుపతి ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వస్తున్నారంటే ప్రజలకు ఒక ఆశ, భరోసాపై ఒక నమ్మకం ఉంటుందని, ఇవేమీ ముఖ్యమంత్రి పర్యటనలో కనిపించలేదన్నారు. ఎందుకు వచ్చారో తెలియదు.. ఎందుకు వెళ్లారో తెలియదని, కూటమి ఇచ్చిన హామీల ఊసే లేదని, విద్యారంగ అభివృద్ధికి తీసుకునే ప్రణాళికే లేదని బాపట్లలో ముఖ్యమంత్రి పర్యటన మొత్తం నిరాశ మిగిల్చిందని కోన రఘుపతి ఆరోపించారు.

ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-అద్దంకి

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, చక్రాయపాలెం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న కె.వి. శ్రీనివాసరావును నేస్తం మిత్ర మండలి సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం స్థానిక విశ్వ భారతి జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో బూదాటి సుధాకర్ మాట్లాడుతూ కష్టపడి పని చేసే వ్యక్తి, వృత్తి ధర్మాలను ఇష్టంగా నెరవేరుస్తూ విద్యార్థులకు చక్కటి విద్యాబుద్ధులు నేర్పిన కె.వి.శ్రీనివాసరావుకు భవిష్యత్తులో మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మాదాల వెంకట సురేష్ బాబు మాట్లాడుతూ జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా విద్యార్థుల అభివృద్ధికి కృషి చేశారన్నారు. హోమియో వైద్యులు కావూరి రఘు చంద మాట్లాడుతూ శ్రీనివాసరావు సమాజం పట్ల అవగాహన కలిగి ఉన్న వ్యక్తి అన్నారు. పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ ప్రతాప్, సోమేపల్లి హనుమంతరావు, చప్పిడి కేశవరావు, దామా సుబ్బారావు, పూకూరి అంజలి, సోమేపల్లి అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పొగాకు కోతలు

కూలీలకు చేతినిండా పని

పెరిగిన పొగాకు సాగు విస్తీర్ణం

రైతులు ఏర్పాటు చేసుకున్న పొగాకు షెడ్డు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ ఏడాది 754 హెక్టార్లలో పొగాకు సాగు చేశారు. పొగాకు పంట కోత దశకు చేరుకుంది. దీంతో రైతులు పొగాకు ఆకులను కోస్తూ బిజీగా గడుపుతున్నారు. మండలంలోని యర్రగొండపాలెం, మురారిపల్లి, గోళ్లవిడిపి, గంగపాలెం, బోయలపల్లి, గురిజేపల్లి, అమానుగుడిపాడు, వాదంపల్లి, తమ్మడపల్లి, కొలుకుల, గంజివారిపల్లి, వెంకటాద్రిపాలెం, వీరభద్రాపురం, మొగుళ్లపల్లి తదితర గ్రామాల్లో పొగాకు సాగు అయింది. ఈ ఏడాది పొగాకు విస్తీర్ణం గణనీయంగా పెరగడంతో కూలీలకు పనులు దొరుకుతున్నాయి. పొగాకు పంటకు మంచి ధర లభిస్తుండడంతో విస్తీర్ణం పెరిగినట్లు అధికారుల అంచనా. సుమారు 80 రోజుల అనంతరం పొగాకు పంటలో మొదటి దశలో ఆకులను కోత జరిపిస్తున్నారు.

పెరిగిన ఖర్చులు..

ఎకరాకు కోత, ఆకులు కట్టడానికి 10 మంది అవసరం కాగా ఒక్కో కూలీకి రూ.500 ఇస్తున్నారు. ఆకులను ఎద్దుల బండిపై కల్లం వద్దకు చేర్చడానికి రూ.2 వేలు బాడుగ. దీంతో పొగాకు కటింగ్, కోసిన ఆకులను కల్లం వద్దకు చేర్చడం, ఆ ఆకులను మందపాటి దబ్బళంతో దండగా కుట్టడం, దండలను షెడ్‌లో అరబెట్టుకోవడం ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతులు రాత్రింపగలు షెడ్ వద్ద పంట దిగుబడికి కాపలా ఉంటున్నారు. పొగాకు పంట సాగుకు పెట్టుబడి ఖర్చులు పెరిగాయని పలు గ్రామాల రైతులు తెలిపారు. ఎకరా సాగులో నారు పెంపకం, గెడం బాడుగ, నాటు కలిపి రూ.8 వేలు, మందులు, పిచికారి రూ.3 వేలు, 3 సార్లు కోతలు, ఆకులు రవాణా, దండలుగా కుట్టడానికి మొత్తం రూ.20 వేలు, పెన్ తయారీ రూ.10 వేలు, బేళ్ల తయారు చేయడానికి రూ.4 వేలు ఖర్చు అవుతోందని రైతులు గిద్దయ్య, మల్లయ్య, తిరుమల్, వెంకటేష్, మధు, బాబయ్యలు తెలిపారు.

కొణతాల పాములును పరామర్శిస్తున్న వరికూటి అశోక్‌బాబు

వైసిపి నాయకుడికి అశోక్ బాబు పరామర్శ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

చుండూరు మండల పరిధిలోని చిన గాదెలవర్రు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కొణతాల శ్రీనివాసరావు తండ్రి కొణతాల పాములును వైసిపి వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు పరామర్శించారు. పాములు గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురి కావడంతో ఆయన యోగ క్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీ అభివృద్ధికి నిత్యం పనిచేసే కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. అధైర్య పడవద్దని అశోక్ బాబు భరోసానిచ్చారు. వీరి వెంట గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మాట్లాడుతున్న పద్మావతి

ఆరోగ్యం పట్ల మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలి

రాష్ట్ర ఆరోగ్య శాఖ సంచాలకులు పద్మావతి

ప్రజాశక్తి-బాపట్ల

ఆరోగ్యం పట్ల మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ సంచాలకులు కె.పద్మావతి అన్నారు. శనివారం వైద్య, ఆరోగ్య అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ అత్యవసర టీములు ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ సంచాలకులు కె.పద్మావతి అన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెల కనీసం రెండు లేక మూడు క్యాంపులను నిర్వహించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ పెంపునకు వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. గర్భిణీల ఆరోగ్యం పట్ల మహిళా వైద్యులు సంబంధిత సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, డీఐవో వెంకటేశ్వర్లు, డిపిఎమ్ఓ రోహిణి రత్నశ్రీ, సౌజన్య, వైద్య అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

షటిల్ విజేతలకు నగదు బహుమతులు

నగదు బహుమతులు అందుకున్న విజేతలు

ప్రజాశక్తి-అద్దంకి

ఫ్రెండ్స్ షటిల్ క్లబ్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో షటిల్ టోర్నమెంట్ సింగరకొండ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. 7వ తేదీ ప్రారంభమైన ఈ టోర్నమెంటు ఆదివారం ముగిసింది. రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ చదలవాడ ఫణీంద్ర బాబు, వారి తల్లితండ్రులు చదలవాడ మోహన్ రావు, శ్రీధర కుమారి గార్ల జ్ఞాపకార్థం ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో గిద్దలూరు, మార్కాపురం, ఎర్రగొండపాలెం, పొదిలి, దర్శి, కందుకూరు, కనిగిరి, ఒంగోలు, చీమకుర్తి, మేదరమెట్ల, చీరాల, రేపల్లె, పొన్నూరు, చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ, గుంటూరు వివిధ ప్రాంతాల నుంచి 100 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతిని నరసరావుపేట క్రీడాకారులు ధీరజ్, ధనుష్‌లు గెలుపొంది రూ.10 వేలు నగదు బహుమతిని అందుకున్నారు. రెండో బహుమతిని పొదిలి జట్టు రమేష్, రెహమాన్‌లు సాధించి రూ.8వేలు నగదు అందుకున్నారు. మూడో బహుమతిగా రేపల్లెకు చెందిన మున్నీర్, జితేంద్ర గెలిచి రూ.6 వేలు, నాలుగో బహుమతిగాఅద్దంకి జట్టు భాష, శ్రీనులు గెలిచి రూ.4 వేలు, ఐదో బహుమతిగాఅద్దంకి టీం రాము, కోటి సాధించి రూ.3 వేలు నగదు బహుమతులు అందుకున్నారు. నగదు బహుమతులను డా.ఫణీంద్ర బాబు, గట్టుపల్లి రామారావు, రంగిశెట్టి సాంబశివరావు (లహరి), చక్కా సుబ్బారావు, అడ్వకేట్ మోతుకూరి సుభాష్ బాబు సౌజన్యంతో అందజేశారు. బహుమతి ప్రదానోత్సవంలో డా.చదలవాడ ఫణీంద్ర బాబు, రోటరీ క్లబ్ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, చిన్ని మురళీ కృష్ణ, మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, ఏ.ప్రసన్నాంజనేయులు, లహరి గట్టుపల్లి రామారావు, పసుపులేటి ఆంజనేయులు, మదీనా అల్లా భాష, రాజశేఖర్, స్వామి తదితరులు పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డాక్టర్ ఫణీంద్ర బాబు వారి తల్లితండ్రుల జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం ఈ టోర్నమెంట్ నిర్వహించి క్రీడాకారులకు మంచి ప్రోత్సాహం ఇస్తున్నారని కొనియాడారు.

వెచ్చని నేస్తాలు.. ఉన్ని దుస్తులు..

- పెరిగిన డిమాండ్
- చలి నేపథ్యంలో జోరుగా విక్రయాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

చలి వణికిస్తోంది. ఎన్నడూ లేనంతగా గజగజలాడిస్తోంది. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరినీ హడలెత్తిస్తోంది. దీపావళి వెళ్లిన తరువాత నుంచి చలి బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఉన్ని దుస్తులు విక్రయించే దుకాణాలు వెలుస్తున్నాయి. యర్రగొండపాలెంలో రోడ్డు పక్కనే రెండు ఉన్ని దుకాణాలు ఏర్పాటు చేశారు. రాజస్థాన్‌కు చెందిన వ్యాపారస్తులు ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నారు. ఇక్కడ రూ.100 నుంచి రూ.ఐదు వేల విలువైన ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నారు. స్వెటర్లతో పాటు, ఉన్ని దుప్పట్లు, మంకీ క్యాప్‌లు రకరకాల రంగుల్లో అందుబాటులో ఉన్నాయి. సుమారు పదేళ్ల నుంచి చలికాలంలో రోడ్డు మార్జిన్‌లో ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నామని, ప్రస్తుతం అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

జోరుగా విక్రయాలు..

వాతావరణం మారి చలి పెరగడంతో వెచ్చని దుస్తులకు డిమాండ్ ఏర్పడింది. కొనుగోళ్లు కూడా జోరుగా సాగుతున్నాయి. చలి గాలిలో ఎక్కువగా తిరిగితే రోగాల బారిన పడే అవకాశం ఉంది. చలికి రక్తనాళాలు మూసుకుపోతాయి. దీనిని దష్టిలో ఉంచుకుని చలిలో ఎక్కువగా తిరగకపోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. చలి గాలి నుంచి రక్షణ పొందడానికి ఉన్ని దుస్తులను వినియోగించాలని చెబుతున్నారు. శరీరంలోని వేడి బయటకు వెళ్లకుండా ఉండేందుకు ఉన్ని దుస్తులు ఉపయుక్తంగా ఉంటాయి. తలకు టోపీలు, స్వెటర్లు వేసుకుని బయటకు వెళ్లేవారు చలి నుంచి రక్షణ పొందే అవకాశముంది.

తెల్లవారుజాము నుంచే..

ప్రతి రోజూ తెల్లవారు జామున చలి గాలితో పాటు మంచు కురుస్తోంది. దాంతో రాత్రి, తెల్లవారు జామున రోడ్లపై ఎలాంటి రక్షణ లేకుండా తిరిగితే జలుబు, దగ్గు వ్యాధులకు గురవుతారని వైద్యులు తెలియజేస్తున్నారు. గతంలో శరీరంలో ఉష్ణం పెంచుకోవడానికి తెల్లవారు జామునే గడ్డితో చలి మంటలు వేసుకొని కాగేవారు. గడ్డి కొరతతో ఇప్పుడు మంటలు వేసేవారు కూడా కనిపించడం లేదు. పొగ మంచు కారణంగా రోడ్డుపై వచ్చే వాహనాలు కనిపించక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.అప్పుడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ధరలు పెరిగాయి

మెడబలిమి చెన్నకేశవులు, యర్రగొండపాలెం

ఉన్ని దుస్తుల ధరలు బాగా పెరిగాయి.ఉన్ని దుస్తులంటే ఇంట్లో అందరికీ చాలా ఇష్టం. గతంలో కుటుంబంలోని సభ్యులందరికీ కొనుగోలు చేసే వాడిని. పెరిగిన ధరల కారణంగా ఈసారి పిల్లలకు మాత్రమే తీసుకున్నాను. చలి పెరుగుతున్న నేపథ్యంలో ఉన్ని దుస్తులు ఉపశమనం కలిగిస్తాయి. తెల్లవారుజామున లేసి పనులు చేసుకోవడానికి రైతులు పొలాల్లోకి వెళ్లేటప్పుడు వీటి అవసరం చాలా ఎక్కువ.

ఎన్నడూ లేని విధంగా

మారపాకుల ఆంజనేయులు

గతంలో ఎన్నడూ లేని విధంగా నవంబర్ నెల నుంచే చలి ప్రారంభమైంది. కార్తీక మాసంలో చన్నీళ్లతో స్నానం చేసేవారం. చలి పెరిగిపోవడంతో తెల్లవారుజామున స్నానాలు చేయలేకపోతున్నాం. చలిని తట్టుకోవడానికి ఉన్ని దుస్తులు ఉపయోగిస్తున్నాం.

చలిలో తిరగరాదు

డాక్టర్ కృష్ణారెడ్డి, ప్రభుత్వ వైద్యులు, యర్రగొండపాలెం

శీతాకాలంలో చలిలో ఎక్కువగా తిరగడం అంత మంచిది కాదు. తప్పనిసరి పరిస్థితిలో చలి గాలిలో తిరిగే సమయంలో ఉన్ని స్వెటర్లు ధరించాలి. చెవుల్లోకి చలి గాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలి. గోరువెచ్చని నీళ్లతో స్నానం చేయాలి. చలిలో తిరిగిన సమయంలో జలుబు వచ్చి ఆనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

మాట్లాడుతున్న నాయకులు

18న ముస్లిం హక్కులపై సదస్సు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఈనెల 18న ప్రపంచ మైనారిటీ హక్కుల దినోత్సవం, 19న అమరవీరుడు షహీద్ అష్ఫఖుల్లా ఖాన్ వర్ధంతి సందర్భంగా కాలరాయబడుతున్న ముస్లిం హక్కులు అనే అంశంపై ఈనెల 18న సదస్సు నిర్వహిస్తున్నట్లు ముస్లిం సంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. ముస్లిం సంక్షేమ సంఘ కార్యాలయంలో ముస్లిం ప్రజా సంఘాల నాయకులు సీనియర్ ముస్లిం నాయకులు సయ్యద్ సర్దార్ అధ్యక్షతన ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 18న సదస్సు స్థానిక ఇస్లాంపేట ముస్లిం కమ్యూనిటీ హాలులో సదస్సు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ సదస్సులో లౌకిక,ప్రజాస్వామిక వాదులు, మేధావులు ,సామాజిక కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు ఈ సమావేశంలో ముస్లిం సామాజిక కార్యకర్త పఠాన్ కరిముల్లా ఖాన్, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఇస్మాయిల్, ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ మహమ్మద్ రఫీ, పఠాన్ సర్దార్ ఖాన్, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, ప్రధాన కార్యదర్శి షేక్ జిలాని, పట్టణ అధ్యక్షుడు షేక్ రెహమాన్, మొహమ్మద్ యూనిస్, దర్యావలి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ వికలాంగుడికి సేవా సదన్ సభ్యులు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. గుంటూరు జిల్లా తెనాలి పట్టణం చావలి గ్రామ వాసి ఎస్.గోపినాథ్ ఏడాది క్రితం రైలు ఎక్కే క్రమంలో జారి పట్టాలపై పడ్డాడు. దీంతో అతనికి కుడి చెయ్యి మొత్తం తొలగించారు. ఎడమ చేతి బొటన వేలు చూపుడు వేలు కూడా తొలగించారు.గోపినాథ్ కోలుకోవడానికి ఆసుపత్రి ఖర్చులు రూ.15 లక్షలు అయ్యాయి. దీంతో గోపినాథ్‌దీన స్థితిలో ఉన్నారు. పనులకు పోలేక చేసిన అప్పులు తీర్చలేక చాలా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం గురించి సేవాసదన్ ఆర్థిక సాయం అందించింది. ఈ సందర్భంగా సేవా సదన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి మాల్యాద్రి మాట్లాడుతూ ప్రతినెలా సహకరిస్తున్న సేవా సదన్ దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సదన్ క్రియాశీలక సభ్యులు సిహెచ్. సుజాత, టి.హరీష్, డి.అక్కలక్ష్మి, జాలిపల్లి హరిబాబు, గడ్డం ప్రవీణ్, హిందీ టిజిటి, సి.సోమశేఖర్, అరుణకుమారి, ఎం.కామేశ్వరి, సురేష్, భారతి, పి.మంజుల, పగడాల వెంకట సుధాకర్, టి.కష్ణవేణి, ఏ.పావని ప్రియాంక, ఎన్.ప్రమీలదేవి, వెంకటరాణి, సత్యవతి, మదనాల పద్మ ు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దామచర్లను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

విశ్వబ్రాహ్మణులకు అండగా ఉంటా : దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు

విశ్వ బ్రాహ్మణులకు అండగా ఉంటానని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ తెలిపారు. ఒంగోలు సౌత్ బైపాస్‌లోని ఎంఎస్‌ఆర్‌కాలనీ వద్ద నున్న విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, కివ్వో సాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ రవి తొట్టెంపూడి, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ హాజరయ్యారు. తొలుత విశ్వబ్రాహ్మణ కల్యాణమండపం కమిటీ సభ్యులు దామచర్ల జనార్ధన్‌కు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి వేద ఆశీర్వచనం చేశారు.అనంతరం సభలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సంఘీయులకు అండగా ఉంటానని తెలిపారు విశ్వబ్రాహ్మణుల కాలనీ మరియు కల్యాణ మండపానికి రోడ్డు, విశ్వబ్రాహ్మణులకు వర్కింగ్ కాంప్లెక్స్ కల్యాణ మండపంపై మరో అంతస్థకు స్లాబ్ వేయడానికి సహకరిస్తానని తెలిపారు.కాలనీ ఏర్పాటు చేసి అండగా ఉంటారని హామీ ఇచ్చారు. కల్యాణ మండపం ప్రధాన కార్యదర్శి పోతకమూరి బాల సుబ్రమణ్యం మాట్లాడుతూ 300 మంది కుటుంబాలకు విశ్వబ్రాహ్మణులకు కాలనీ, కార్పెంటర్లకు వర్కింగ్ కాంప్లెక్స్ కల్యాణ మండపానికి సిమెంట్ రోడ్, రాజకీయంగా తమ కమ్యూనిటీని ముందుకు తీసుకెళ్లాలని జనార్ధన్ దష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీకి అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కివ్వో సాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ రవి తొట్టెంపూడి మాట్లాడుతూ కల్యాణ మండంపై రెండో అంతస్తు వేయడానికి తన వంతు సహకారం అందిస్తారని హామీ ఇచ్చారు. అనంతరం అతిథులను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కల్యాణ మండపం అధ్యక్షులు చోడా శ్రీనివాసులు, నగర ప్రచార కార్యదర్శి మంచా బాబు, గౌరవాధ్యక్షులు గోనుగుంట బ్రహ్మానంద శర్మ, మహంకాళి ఏడుకొండలు, టౌన్ అధ్యక్షుడు మానేపల్లి గోవిందా చారి, ప్రధాన కార్యదర్శి కందుకూరు దక్షిణామూర్తి, ఉపాధ్యక్షుడు చోడా వెంకటేశ్వర్లు, కమిటీ మెంబరు అద్దంకి స్టాలిన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు హైస్కూల్ మైదానంలో సూదనగుంట కోటయ్య చౌదరి అండ్ ఆదిలక్ష్మి మెమోరియల్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారమూ ఉత్సాహంగా సాగాయి. రెండో రోజూ పోటీలను సూదనగుంట కోటయ్య చౌదరి ఆదిలక్ష్మి మెమోరియల్ వ్యవస్థాపకులు, ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ సూదనగుంట రాఘవేంద్ర ప్రసాద్ ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్.విజయ్ కుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ పాల్గొన్నారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో క్రీడారంగం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూదనగుంట ఫౌండేషన్ కుటుంబ సభ్యులు డాక్టర్ సూదనగుంట రాఘవేంద్ర ప్రసాద్, కష్ణమూర్తి, వెంకట సుబ్బారావు, కెవి. రమణయ్య, బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ కార్యదర్శి కరణం పున్నయ్య చౌదరి, మాజీ కబడ్డీ క్రీడాకారుడు మచిలీపట్నం ఎఎస్‌పిబి సత్య నారాయణ, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శీకాంత్, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భాస్కరరావు, పూర్ణచంద్రరావు, ఒంగోలు హైదరీ క్లబ్ సెక్రటరీ డాక్టర్ రాఘవ, టిడిపి జిల్లా నాయకులు బొమ్మినేని రామాంజనేయులు, సిపిఎం జిల్లా నాయకులు షేక్ మాబు, కాలం సుబ్బారావు, టోర్నమెంట్ ఆర్గనైజర్స్ వెంకటేశ్వర్లు, నారాయణస్వామి చౌదరి, శ్రీనివాస రావు, వేణుబాబు,శంకర్ పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొమరోలు

మండల పరిధిలోని తాటిచెర్ల గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బత్తుల ఎల్లయ్య కుమారుడు రవికుమార్ యాదవ్, వెంకట శ్రావణి వివాహ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో టిడిపి మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆశీర్వదిస్తున్న అన్నా రాంబాబు, జంకె వెంకటరెడ్డి

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి - కొనకనమిట్ల

గ్రామ ఉపసర్పంచ్ మెట్టు అల్లూరిరెడ్డి, తిరుపతమ్మ కుమారుడు వెంకయ్య, లక్ష్మీదేవిల వివాహ వేడుకలలో గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబు, మార్కాపురం మాజీ శాసన సభ్యులు జంకె వెంకటరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి, మునగపాడు ఎంపీటీసీ మెట్టు వెంకటరెడ్డి, ఎంపీటీసీ కల్లం సుబ్బమ్మ దిబ్బారెడ్డి, మాజీ సర్పంచి పునుగోటి కొండారెడ్డి, ఆర్యవైశ్య సంఘం మండల మాజీ అధ్యక్షులు గర్రె శ్రీనివాసులు, వద్దిమడుగు మాజీ ఎంపిటిసి జి దేవదాస్, నాయకులు రెడ్డెం తిరుపతిరెడ్డి, పునుగోటి అంజిరెడ్డి, యక్కంటి తిరుపతిరెడ్డి, పాలూరి లక్ష్మీ వెంకటేశ్వర్లు, సీగినం ఏడుకొండలు, వెంకటేశ్వరరెడ్డి, ఎఎ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాయం కాశిరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-దర్శి

దర్శి వాస్తవ్యులు రెడ్డిమాసు రాములు వర్ధంతి సందర్భంగా స్థానిక కురిచేడు రోడ్డులోని శ్రీశిరిడి సాయిబాబా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, 25 కేజీల బియ్యం, పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వారి కుమారుడు రెడ్డిమాస శ్రీనివాసరావు, మనవళ్లు పావులూరి నాగార్జున, పావులూరి సుధీర్‌కుమార్, ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

గర్నెపూడిని సత్కరిస్తున్న ఆదరణ వెల్ఫేర్ సభ్యులు

'గర్నెపూడి'కి తెలుగు తేజం పురస్కారం

ప్రజాశక్తి-దర్శి

తెలుగు భాష ప్రాధాన్యత గురించి కవి రత్న, సాహితీ వజ్ర జియో (గర్నెపూడి యోబు) గానం చేయగా, వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు గోటిముక్కల చెన్నకేశవులు, వారి మిత్ర బృందం దానరాసి ఉషారాణి, అరెకటిక నాగేశ్వరావు, ఐనకోట రవికుమార్ చేతుల మీదుగా దర్శికి చెందిన గర్నెపూడి యోబుకు 2024 సంవత్సరం తెలుగు తేజం పురస్కారంతో పాటు ప్రశం పత్రం, దుషశాలువాలను కప్పి ఘనంగా సన్మానించారు. తెలుగు భాష అభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందించారు. ఆదరణ వెల్ఫేర్ సొసైటీ దశమ వార్షికోత్సవ సందర్భంగా మార్కాపురంలోని గోళ్ళ సత్యనారాయణ కళ్యాణ మండపంలో జాతీయ కవి సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి రచయితలు, కవులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సూపర్ స్టార్ కృష్ణ, కళా పరిషత్ అధ్యక్షులు జాలది మోహన్‌బాబు, ప్రముఖ సాహితీ వేత్త సి నారాయణస్వామి, కె యర్రయ్య పాల్గొన్నారు.

సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు పిసి కేశవరావు

ప్రజాశక్తి - కనిగిరి

స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు మండల జనరల్ బాడీ సమావేశం కుమారి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా నాయకులు పిసి కేశవరావు మాట్లాడుతూ సమ్మె కాలంలో ప్రభుత్వం అంగన్‌వాడి, మున్సిపల్ కార్మికులతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని కోరారు. మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్ వాడీలుగా మార్చాలని కోరారు. అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలం వేతనాలను అమలు చే యాల ని అన్నారు. సంక్రాంతి కానుకలను అందించా లని కోరారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు సెలవులు మంజూరు చేయడంతో పాటు కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. ఆశా కార్యకర్తలపై అధికారులు, రాజకీయ నాయకుల వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఎలకు కనీస వేతనాలు అమలు చేసి సకాలంలో ఇవ్వాలని కోరారు. సమావేశంలో సిఐటియు నాయకులు సీత, పద్మజ, రాజ్యలక్ష్మి, దానం, చెన్నమ్మ, సౌభాగ్యం, జి ఓబయ్య, చార్లెస్, లక్ష్మయ్య, పిచ్చయ్య, భాస్కర్, అహ్మద్ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సిఐటియు నాయకులు, కార్యకర్తలు

చివర భూముల్లోనూ

వరి నాటుతున్న రైతులు

ప్రజాశక్తి-దర్శి

సాగర్ ఆయకట్టు పరిధిలో రైతులు ఈ ఏడాది చివరి భూముల్లో కూడా వరి నాట్లు వేస్తున్నారు. గతేడాది సాగరకు నీరు రాకపో వడంతో సాగర్ కెనాల్ పక్కన ఉన్న కొద్ది మంది రైతులు మాత్రమే వరి నాట్లు వేశారు. ఈ సంవత్సరం నాగార్జున ప్రాజెక్టుకు నీరు పుష్కలంగా రావడంతో సాగునీటిని రైతుల కోసం అధికారులు విడుదల చేశారు. ప్రభు త్వం మొదట్లో సాగర్ కెనాల్‌కు నీటిని విడుదల చేసినప్పుడు మెట్టపైర్లుకు మాత్రమే నీటిని విడుదల చేసినట్లు ప్రకటించింది. అయినా కూడా రైతులు నీరు పుష్కలంగా రావడంతో వర్షాలు సక్రంగా పడటంతో దర్శి మండలంలో దాదాపుగా 20వేల ఎకరాలు ఆయకట్టు ఉండగా 80శాతం రైతులు వరి నాటు వేశారు. సాగర్ ఆయకట్టు కింద జిల్లాకు 4 లక్షల 50 వేల ఎకరాలు వరి మెట్టపైర్లకు నీరు అందవలసి ఉంది. అయితే అధికారులు మాత్రం వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటలు వేసుకో వాలని రైతులకు విన్నవించారు. అయినా పైపొలంలో వరి నాటితే కింది పొలం ఏ పంట పండే పరిస్థితి ఉండదు. కావున రైతులందరూ చివరి భూముల వరకు వరి నాటే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వర్షాలు సక్రంగా పడినందు వలన నీటికి ఎలాంటి ఇబ్బంది ఇప్పటికి జరగలేదు. రైతులు మార్చి వరకు నీరు వస్తుందని చివరి భూములు కూడా వరి నాట్లు వేస్తున్నారు. దర్శి మండలంలో అధికారులు అంచనాల లెక్కల ప్రకారం 20వేల ఎకరాలకు గాను 80 శాతం పైగా వరి నాట్లు వేశారు. మండ లంలోని నిప్పట్లపాడు మేజర్ కాల్వ కింద కొర్లమడుగు, త్రిపుర సుందరాపురం, కొత్త పల్లి, రాజంపల్లి గ్రామాల రైతులు వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. కొర్లమడు గు చెందిన బత్తుల వెంకటేశ్వర్లు తనకున్న నాలుగు ఎకరాల భూమిలో వరి నాట్లు వేస్తు న్నట్లు తెలిపారు. మొదట్లో కంది పంట వేసి పంట బాగున్నప్పటికీ కూడా పైన వరి నాటి నందువలన తాము కూడా చివర భూము లైనప్పటికీ వరి నాటవలసి వస్తుందని తెలిపారు. అదే విధంగా ఆ మేజర్ కింద అందరి వరి నాట్లు వేస్తూ ఉన్నా రు. ఆగస్టు నుండి నీరు వస్తున్నప్పటికీ వరి నారుమళ్లు అక్టోబర్‌లో పోసి నవంబర్, డిసెంబర్‌లో కూడా నాటుతున్నట్లు కొర్లమడుగు చెందిన బత్తుల రామాంజనేయరెడ్డి, సుబ్బారెడ్డి తెలిపారు.

సాగర్ కాలువ చివరి భూముల్లోనూ వరి నాట్లు వేస్తున్న కొర్లమడుగు రైతులు

నీటి సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి మృతి

ప్రజాశక్తి - కొనకనమిట్ల

మండలంలోని తువ్వపాడు గ్రామానికి చెందిన నీటి సంఘం మాజీ అధ్యక్షులు ఉడుముల వెంకట సుబ్బారెడ్డి(80) శని వారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు సంతానం కలరు. వెంకట సుబ్బా రెడ్డి భౌతికాయాన్ని విశ్రాంత ఉపాధ్యాయులు, మాజీ ఎంఎల్‌ఓ ఉడుముల పిచ్చిరెడ్డి, చిన్నారికట్ల సింగిల్ విండో అధ్యక్షులు ఉడుముల కాశిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, డీలర్ అసోసియేషన్ అధ్యక్షులు ఉడుముల వెంకటేశ్వర్‌రెడ్డి, దేవిరెడ్డి సుబ్బారెడ్డి, చెరుకూరి నారాయణ ఆదివారం సందర్శించి వాళులు అర్పించారు. సుబ్బారెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.



వెంకట సుబ్బారెడ్డి(80)

పెదఇర్లపాడులో చోరీ

ప్రజాశక్తి - పీసీపల్లి

లింగాలదిన్నె లక్ష్మీ మాల్యాద్రి నరసింహారెడ్డి కుటుంబం సభ్యులు ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్ వెళ్లారు. ఈనెల 2న తిరిగి ఇంటికి వచ్చారు. కొన్నిరోజులు తర్వాత వారు బీరువా తెరిచి పరిశీలించగా తొమ్మిది సవర్లు బంగారం, రూ.15వేల విలువైన వెండి చోరీకి గురైందని గమనించారు. ఈ విషయాన్ని నరసింహారెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ జి కోటయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్గదర్శకాలేవీ ..?

కొత్త రేషన్ కార్డులు అందక పేదల పాట్లు

సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు

ప్రారంభం కాని కొత్త కార్డుల ప్రక్రియ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కూటమి ప్రభుత్వం కొలువు దీరిన ఆరవ నెలలో అర్హులైన వారికి నూతన కార్డుల పంపిణీ ప్రక్రియను డిసెంబర్ రెండో తేది నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే స్థాయి నుంచి ముఖ్యమంత్రి వరకు గత కొన్ని రోజులుగా ఊదరగొట్టారు. ఈ ప్రక్రియ ఈనెల రెండో తేదీ నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ఆయా సచివాలయాలకు దరఖాస్తులకు సంబంధించి మార్గదర్శకాలు అందలేదు. దీంతో రేషన్ కార్డు లేని వారు దరఖాస్తులు చేసుకోవడానికి సచివాలయాలకు వెళ్లి నిరాశతో వెనుతిరగాల్సిన పరిస్థితి నెలకొంది. అర్హులైన వారికి ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డుల మంజూరు కోసం ఈనెల రెండో తేదీ నుంచి దరఖాస్తులను తీసుకుని సంక్రాంతికి కానుకగా నూతన కార్డులు అందించాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. దీంతో పాటు ప్రస్తుతమున్న రేషన్ కార్డులలో చేర్పులు మార్పులకు అవకాశం కల్పించింది.

యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని యర్రగొండపాలెం మండలంలో 21, పుల్లలచెరువు మండలంలో 18, త్రిపురాంతకం మండలంలో 21, పెద్దారవీడు మండలంలో 14, పెద్దదోర్నాల మండలంలో 12 చొప్పున ప్రజలకు సచివాలయాలు అందుబాటులో ఉన్నాయి. రేషన్ కార్డుల దరఖాస్తుతో పాటు కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వీటికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం ఆయా కార్యాలయాలతో పాటు సచివాలయాలకు మార్గదర్శకాలను జారీ చేయాల్సి ఉంది. అయితే ఇప్పటిదాకా మార్గదర్శకాలు విడుదల కాలేదు. గత ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో నియోజకవర్గంలో ఎంతో మంది వాటికోసం ఎదురు చూస్తున్నారు. కొత్తగా వివాహమైన వారు, కార్డులలో తొలగింపులు, చేర్పులు, మార్పులు చేయాల్సిన వారు వేల సంఖ్యలో ఉన్నారు. ఇటువంటి వారందరూ దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే దీనికి సంబంధించి సర్వర్ ఇప్పటి వరకు అందుబాటులో రాలేదు. అర్హులైన వారు దరఖాస్తులు తీసుకొని సచివాలయాలకు వెళ్తున్నారు. వెంటనే ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సర్వర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

యర్రగొండపాలెం గ్రామ సచివాలయం

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

టంగుటూరి సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి, యర్రగొండపాలెం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఎన్నో హామీలిచ్చింది. అధికారం చేజిక్కించుకొని ఆరు నెలలు గడుస్తున్నా సంక్షేమం మాటే ఊసెత్తడం లేదు. ఫలితంగా పేదలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులకు అర్హులైన ప్రజలు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలి.

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కొల్లూరు

మండల కేంద్రమైన కొల్లూరులోని ది ఎంప్లాయిస్ రిక్రియేషన్ హోమ్‌లో ఆదివారం శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ ప్రారంభించారు. శంకర కంటి ఆసుపత్రి డాక్టర్లు కంటికి సంబంధించిన కంప్యూటర్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రపంచాన్ని చూడాలంటే నేత్రాలు చాలా ముఖ్యమైనవి కావున వీటిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అవసరమైన వారికి తక్కువ ధరకే అద్దాలు సిఫార్స్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షులు సుంకర రామ్మోహన్ బాబు, శంకర్ ఆసుపత్రి బృందం, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని వైష్ణవి గార్డెన్స్‌లో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాలు వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు యర్రగొండపాలెం మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. అలాగే సాయంత్రం ఆరు గంటల నుంచి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ రెండు కార్యక్రమాల్లో వైసీపీ జిల్లా రీజినల్ కో-ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వైసీపీ ఎంపిపి, జడ్పిటిసిలు, సర్పంచ్‌లు, మండల అధ్యక్షులు, వార్డు మెంబర్లు, రాష్ట్ర, జిల్లా స్థాయి పదవులు ఉన్నవారు, సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు, పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా కన్వీనర్‌లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

రూ.10 వేల ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని చిన్న గుడిపాడు గ్రామ టిడిపి నాయకులు ఐనేని మల్లికార్జున టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకొని కొత్తూరు గ్రామంలో తల్లిదండ్రులు లేని అనాథ బాలికకు రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఐనేని మల్లికార్జున మాట్లాడుతూ అనాథ బాలిక కుటుంబ అవసరాలకు, చదువుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఆ బాలికకు మంచి భవిష్యత్తు ఇవ్వడానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు గ్రామ టిడిపి నాయకులు కొప్పుల సుబ్బారెడ్డి, కొప్పుల కోటిరెడ్డి, కొప్పుల చెంచిరెడ్డి, దొడ్డ బాబు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి పంట పరిశీలన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని సానికవరం గ్రామంలో సాగులో ఉన్న మిర్చి పంటను పరిశీలిం చారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఒంటేరు రాజాకృష్ణ మూడు ఎకరాల్లో సాగు చేసిన మిరప పంట వైరస్ ప్రభావం వల్ల తీవ్రంగా నష్టపోయిందన్నారు. కుచ్చు తెగులుతో మొక్కలు ఎండిపోతు న్నాయన్నారు. ఇదే పరిస్థితి ఈ ప్రాంత రైతులందరి పొలాల్లో ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి మిర్చి పంటపై సర్వే నిర్వహించాలన్నారు. నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలన్నారు.

పంటలు పరిశీలిస్తున్న నేతలు →

గంగవరంలో నేత్రదానం

ప్రజాశక్తి-ఇంకొల్లు

ముత్యాలు (ఫైల్)

మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన జాగర్లమూడి ముత్యాలు (82) వృద్ధాప్యంతో పాటు అనారోగ్యతో ఆదివారం మృతి చెందాడు. ముత్యాలు నేత్రాల కార్నియాను కుమారులు జాగర్లమూడి వాసు బాబు, రవీంద్రబాబులతో పాటు కుటుంబ సభ్యులు పెదకాకానికి చెందిన శంకర్ నేత్ర వైద్యశాలకు దానం చేశారు. ఇంకొల్లుకు చెందిన రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు జట్టి వెంకటేశ్వర్లు, సోమాపల్లి రామ్మోహన్‌రావు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మొహమ్మద్ రఫీ, జాగర్లమూడి శివ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్యకర్తలతో వరికూటి అశోక్ బాబు

ఎమ్మెల్యే కొండయ్య ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని యాదవపాలెం శివాలయం వద్ద గ మురళి గోపాలకృష్ణ మందిరం 14వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, సతీమణి బాల కొండమ్మతో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర కమిటీ ప్రతినిధులు కొండయ్య దంపతులను శాలువాతో సత్కరించారు. అనంతరం పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మందిర కమిటీ ప్రతినిధులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మహిళలతో ఎమ్మెల్యే కొండయ్య దంపతులు

ప్రమాణస్వీకార మహోత్సవాన్ని జయప్రదం చేయండి

టీడీపీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

విజయవాడలోని ఆర్టీసి బస్టాండ్ దగ్గరలో గల తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా టీడీపీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ ప్రమాణ స్వీకారం చేయనున్నారని జిల్లా తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ సమ్మద్ బాషా తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి మండల పరిధిలోని ముస్లిం మైనారిటీలు, అన్నీ అనుబంధ కమిటీలలో సభ్యులుగా ఉన్న వారంతా తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో షేక్ సత్తార్, పఠాన్ సత్తార్, హాజీ మొగల్ రఫీ, డి దర్‌గయా, షేక్ మౌలాలి, షేక్ దావూద్, పఠాన్ యును సుభాని, షేక్ జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నగాదెలవర్రు వైసిపి అధ్యక్షుడిగా సందీప్

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలం చినగాదెలవర్రు వైసిపి నూతన గ్రామపార్టీ అధ్యక్షులుగా గాదెలవర్తి సందీప్ ఎంపికయ్యారు. వేమూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు గ్రామస్తుల సూచనలు, సలహాలు మేరకు సందీప్‌కు పార్టీ బాధ్యతలు అప్పగించారు. గ్రామంలో వైసీపీ బలోపేతానికి గ్రామస్తులందరి సహకారంతో పనిచేసి రానున్న ఎన్నికలలో వైసీపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని అశోక్ బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన గృహ ప్రవేశ వేడుకల్లో మంత్రి, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

నూతన గృహ ప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే దామచర్ల

పిడిసిసి బ్యాంకు మాజీ అధ్యక్షుడు కండె శ్రీనివాసులు త్రోవగుంటలో నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, సంత నూతలపాడు ఎమ్మెల్యే బిఎన్.విజయ్‌కుమార్ పాల్గొన్నారు. తొలుత మంత్రి స్వామి, ఎమ్మెల్యే దామచర్లకు కండే శ్రీనివాసులు కుటుంబ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సత్యనారాయణ వ్రతం సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యే స్వామి పాల్గొన్నారు. అనంతరం గృహాన్ని సందర్శించి పిడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ కండె శ్రీనివాసులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, టిడిపి నాయకుడు మంత్రి శ్రీనివాసరావు, జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్‌రియాజ్, బండారు మదన్, మారెళ్ళ వివేకానంద, పమ్మి భద్రిరెడ్డి, బెల్లం సత్యనారాయణ, కుప్పా రంగనాయకులు, అంబటి ప్రసాద్, బెంగళూరు నరసయ్య, ఝాన్సీరాణి, సుకుమార్, నీలిమారాణి, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ వర ప్రసాద్, శ్రీరామ్ చిట్స్ మేనేజర్ నాయక్ పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాతో విధుల నిర్వహణ

ఎస్‌పి దామోదర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దర్శి సిఐ రామారావుకు డ్రోన్ కెమెరా అందజేస్తున్న ఎస్‌పి

డ్రోన్ కెమెరాతో విధుల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించవచ్చునని ఎస్‌పి దామోదర్ పేర్కొన్నారు. దర్శి మండలం, రాజంపల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ తానికొండ వెంకట్రావు దర్శి సర్కిల్‌లో శాంతి భద్రతల పరిరక్షణ, విపత్తు నిర్వహణ ప్రయోజనాల కోసం డ్రోన్ కెమెరాను ఎపి దామోదర్‌కు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీస్ శాఖ తన పనితీరును మెరుగు పరచుకోవడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తుందన్నారు. ఈ క్రమంలో ఎన్ఆర్ఐ తన స్వదేశానికి సేవ చేసే ఉద్దేశంతో పోలీస్ శాఖకు డ్రోన్ కెమెరాను బహూకరించటం అభినందనీయమన్నారు. ప్రజాసేవలో భాగంగా పోలీస్ వారికి సహాయకారిగా డ్రోన్ కెమెరాను బహూకరించిన తానికొండ వెంకట్రావు కుటుంబ సభ్యులకు ఎస్‌పి కృతజ్ఞతలు తెలిపారు. డ్రోన్ ద్వారా శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, బందోబస్తు, జాతరలు/ఊరేగింపుల్లో అవాంఛనీయ సంఘటనలు నిలువరించవచ్చన్నారు. ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా ముందస్తుగా చర్యలు, ప్రమాదాలు జరిగినప్పుడు, ప్రమాద స్థలాన్ని వేగంగా చేరుకొని, పరిస్థితిని అంచనా వేయవచ్చన్నారు. వరదలు, భూకంపాలు వంటి విపత్తు సమయంలో డ్రోన్‌లను ఉపయోగించి తప్పిపోయిన వ్యక్తులను వెతకడం, సహాయక చర్యలను నిర్వహించడం వంటి పనులు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి సిఐ రామారావు, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ వి.సూర్యనారాయణ, దర్శి ఎస్ఐ మురళి, పిసిఆర్ ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఒంగోలు సమగ్రాభివృద్ధికి..

ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

సిపిఎం నగర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగర సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని సిపిఎం ఒంగోలు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.శనివారం నిర్వహించిన ఒంగోలు నగరపాలక సంస్థ ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ వారానికో డివిజన్ కార్యక్రమం లో డివిజన్ కు ఒక కోటి రూపాయలు నిధులు ఇస్తున్నట్లు చెప్పారని, డివిజన్ కి కోటి రూపాయలు ఎలా సరి పోతాయని ఆయన ప్రశ్నించారు ఒంగోలు నగర సమగ్ర అభివృద్ధి కోసం ప్రణాళిక రూపొందించాలన్నారు, ప్రతిరోజు మంచినీరు ఇస్తామన్న వాగ్దానం నేటికి నీటి మూటగానే మిగిలిందన్నారు, నగరంలో మంచినీటి పథకాలకు రూ.400 కోట్లు, విలీన గ్రామాలకు రూ.379 కోట్లు అవసరమవుతాయని గతంలోనే ప్రకటించారన్నారు. ఈ నిధులను తీసుకురావడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. శివారు కాలనీలకు మంచినీటి పైపులైన్లు ఏర్పాటు చేసి గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా చేయాలన్నారు. కార్పొరేషన్ లో విలీనమైన గ్రామాలలోని చెరువులను మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. కొప్పోలు చెరువును మూడో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా మార్చాలన్నారు. వీటన్నిటికీ అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి తీసుకువచ్చి ప్రజలకు ప్రతిరోజు మంచినీరు ఇచ్చే వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుధ్యం మెరుగుదల, మురుగు నీటిపారుదల, పార్కుల నిర్మాణం, శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలు, దోమల నివారణ, రోడ్ల కాలువల నిర్మాణం, ప్రభుత్వ భూముల ఆక్రమణల తొలగింపు, రోడ్డు వెడల్పు, ట్రాఫిక్ సమస్య పరిష్కరించడం, పేదలు నివసిస్తున్న కాలనీలలో రోడ్లు సైడు కాలువలు నిర్మాణం చేపట్టాలన్నారు. విద్యుత్ లేని కాలనీలకు విద్యుత్ సరఫరా చేయాలన్నారు. నగరంలో సుమారు 19 వేలమంది నిరుపేదలకు ఇంటి స్థలం లేదని గత ప్రభుత్వం నిగ్గు తేల్చిందన్నారు. పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో ప్రారంభించిన టిడ్కో ఇళ్లను వైసిపి ప్రభుత్వం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చి 6 నెలలు గడిచినా వాటిని లబ్ధిదారులకు ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వ భూములలో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు కూడా ఇవ్వలేదన్నారు. నగరంలో సుందరీకరణ పేరుతో పూల మొక్కలు వేయడం రోడ్ల డివైడర్లకు రంగులు వేయటం అభివృద్ధి కాదన్నారు. నగరంలో 16 పార్కులు ఉన్నాయన్నారు. పరికరాలు విరిగి సంవత్సరాలు గడిచిన నేటికీ వాటికి మరమ్మతులు చేయలేదన్నారు. ఈ అంశాలన్నింటిని పరిగణలోకి తీసుకుని నగర సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పెషల్ ప్యాకేజీ తెచ్చి అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పారిశుధ్య కార్మికులను అవమానపర్చిన ఎమ్మెల్యే

వరుస పదజాలంతో పారిశుధ్యకార్మికులను అవమానపర్చిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు వారికి క్షమాపణ చెప్పాలని సిపిఎం ఒంగోలు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఒంగోలు నగర పాలక సంస్థ ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పారిశుధ్య కార్మికులను వెధవలతో పోల్చటం సరికాదన్నారు. పారిశుధ్య కార్మికులపై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఒంగోలు నగరంలో ప్రతి రోజు 150 టన్నుల చెత్త వస్తుందని, సుమారు 125 కిలోమీటర్ల పరిధిలో సుమారు 900 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారన్నారు. పర్మినెంట్ కార్మికులను మేస్త్రీలు నియమించి పని చేయించటం ఆనవాయితీగా వస్తుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒంగోలు నగర పాలక సంస్థలో మేస్త్రీలు ఆపివేశారన్నారు. ఆపివేసిన మేస్త్రీలను కొనసాగించాలని ఆయన కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

- బాపట్ల జిల్లాలో 33,365 పొదుపు సంఘాలు ఏర్పాటు
- బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు
- మహిళా మార్టులు ఏర్పాటు
- రైతు ఉత్పాదక సంఘాలు ఏర్పాటు
- డిఆర్‌డిఎ పీడీ పి. పద్మ



ముఖాముఖి

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

పొదుపు సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు డిఆర్‌డిఎ పీడీ పి.పద్మ తెలిపారు. పేదరిక నిర్మూలనలో భాగంగా పేద, బలహీనవర్గాలకు చెందిన మహిళలను స్వయం సహాయక బృందాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లోని సంఘాలను గ్రామ సంఘాలుగా, మండల పరిధిలోని సంఘాలను మండల సమాఖ్యలుగా ఏర్పాటు చేసిన మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. డిఆర్‌డిఎ ద్వారా పొదుపు సంఘాల ఆర్థికాభివృద్ధి కోసం చేపడుతున్న చర్యలు గురించి డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మ ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు. అవన్నీ ఆమె మాటల్లోనే...

ప్రభుత్వం ద్వారా అమలు అవుతున్న సంక్షేమ పథకాలు పొదుపు సంఘాల మహిళలకు చేరేలా, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు నిబద్ధతతో పనిచేస్తున్నాం. జిల్లాలోని 25 మండలాల్లో 33,365 పొదుపు సంఘాలు ఉన్నాయి. అందుల్లో 3,34,742 మంది సభ్యులు ఉన్నారు. ఎస్సీ గ్రూపులు 8610, ఎస్‌టి గ్రూపులు 1175, బీసీ గ్రూపులు 13,009, మైనారిటీ గ్రూపులు 1473ఉన్నాయి. ఈ పొదుపు సంఘాలలోని మహిళల ఆర్థికాభివృద్ధి కోసం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా చేయూత, ఉన్నతి, స్త్రీ నిధి, బ్యాంక్ లింకేజి, గృహ నిర్మాణాలు ,స్పందన, చంద్రన్న బీమా పింఛన్లు అందజేస్తున్నారు. జిల్లా స్థాయిలో డిపిఎంలు, ఎపిఎంలు, అడ్మిన్ అసిస్టెంట్లు ఈ పథకాలు అమలు చేస్తున్నారు. ఫీల్డ్ స్థాయిలో ఏరియా కో ఆర్డినేటర్లు, ఎపిఎంలు, సిసిలు, స్త్రీ నిధి మేనేజర్లు పర్యవేక్షిస్తున్నారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛను స్కీమ్ ద్వారా జిల్లాలో నవంబరు 30న 2,28,615 మంది లబ్ధిదారులకు రూ 95.49 కోట్లు అందజేశారు. 98.76 శాతం పింఛన్లు పంపిణీ పంపిణీ చేశారు. స్త్రీ నిధి – పేదల జీవనోపాదుల పెంపుదల కోసం ఆర్థికసాయం అందించేందుకు, అధిక వడ్డీ భారం నుంచి మహిళా సంఘాల సభ్యులను రక్షించి వడ్డీ లేని రుణాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మండల సమాఖ్యల ద్వారా స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్యను సహకార సంఘాల చట్టాన్ని 1964 ప్రకారం ఏర్పాటు చేసింది. దీని ద్వారా 2024-25 సంవత్సరానికి 26,110 సభ్యులకు రూ 152.7 కోట్లు లక్ష్యం కాగా 13,429 మంది సభ్యులకు రూ.262.14 కోట్లు మంజూరు చేశారు.

బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు

బ్యాంక్ లింకేజీ ద్వారా 2024-25 సంవత్సరానికి సంబంధించి 10,343 సంఘాలకు రూ.617.93 కోట్లు మంజూరు చేశారు. ఉన్నతి పథకం ద్వారా జిల్లాలో 2024-25 సంవత్సరానికి 1,313 సభ్యులకు రూ 7.62 కోట్లు లక్ష్యం కాగా 810 మందికి రూ 3.48 కోట్లు మంజూరు చేశారు. చంద్రన్న బీమా పథకం ద్వారా రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన 27 క్లెయిమ్స్‌కు రూ 1.35 కోట్లు,సహజ మరణాలకు సంబంధించి 186 మందికి రూ 1.86 కోట్లు అందజేశారు.

మహిళా మార్టులు ఏర్పాటు..

మార్కెట్ ధర కన్నా తక్కువకే నాణ్యమైన నిత్యావసర సరకులను గ్రామీణ ప్రాంత ప్రజలకు అందించేందుకు పొదుపు సంఘాల మహిళల ఆధ్వర్యంలో జిల్లాలోని చీరాల, రేపల్లె, నిజాంపట్నంలో మహిళా మార్టులు ఏర్పాటు చేశారు. పొదుపు గ్రూపుల్లో మహిళలు ఒక్కొక్కరి నుంచి రూ.150 పెట్టుబడి ద్వారా ఒక్కొక్క మార్ట్‌కు రూ.20 నుంచి రూ.28 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు.దానికి డిఆర్‌డిఎ మ్యాచింగ్ గ్రాంట్ కలిపి మహిళా మార్టులు ఏర్పాటు చేశారు. ఈ మార్టుల్లో బయట మార్కెట్ ధర కన్నా తక్కువకే సరుకులు అందజేస్తారు. వీటిలో నిత్యావసర సరకులతో పాటు పొదుపు సంఘాల మహిళలు ఉత్పత్తి సరుకులు కూడా అందుబాటులో ఉంటాయి. ఈ మార్టులను సంఘ సభ్యులే నిర్వహిస్తున్నారు. వచ్చిన లాభాలను ఆయా గ్రూపులకు పంచుతారు. మహిళ నేతృత్వంలోని ముద్ర,స్వయం సిద్ధ, నారీశక్తి,నారీ భేరీ మొదలైన ఉత్పాదక సంస్థలకు 2024-25 సంవత్సరానికి సంబంధించి 4,601 మందికి రుణాల లక్ష్యాన్ని నిర్దేశించారు.

రైతు ఉత్పాదక సంఘాలు ఏర్పాటు

జిల్లాలోని 25 మండలాల్లో ఇప్పటి వరకు 1,732 రైతు ఉత్పాదక సంఘాలు ఏర్పాటు చేశారు. మరో 9 సంఘాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ సంఘాల్లో 20.491 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. సభ్యులకు రూ.35 లక్షల రుణాలు అందజేశారు. జిల్లాలో 274 లేఅవుట్స్‌లో 20,902 మంది మహిళా లబ్ధిదారులు జగనన్న లేఅవుట్లలో పక్కా గహాలు నిర్మించుకుంటున్నారు. వారికి రుణ సదుపాయం కల్పించారు. పొదుపు సంఘాలలోని సభ్యులకు గృహ నిర్మాణం కోసం అదనంగా రూ.35 వేల రుణం ఇస్తున్నారు. గృహాలు మంజూరై పొదుపు గ్రూపుల్లో లేని వారిని కూడా గ్రూపుల్లో చేర్పించి వారికి కూడా రుణాలు ఇస్తారు.